# హేమాచల క్షేత్రం అద్భుతం

- కలెక్టర్ కృష్ణ ఆదిత్య
- ఆలయాల్లో ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, పూజారులు

**మంగపేట:** ఏజెన్సీలో దట్టమైన అటవీ ప్రాంతంలో గల మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం అద్భుతంగా ఉందని కలెక్టర్ కృష్ణ ఆదిత్య కొనియాడారు. రెండో యాదగిరి గుట్టగా ప్రఖ్యాతి గాంచిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రావణం సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలతో పాటు వివిధ రకాల పూలతో సుందరగా అలంకరించారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు స్వామివారికి ఆలయ అర్చకులు శేఖర్‌శర్మ, పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చంద్ రామానుజం తిలాతైలాభిషేకం పూజలు జరిపించారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు యాగశాలలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి సుదర్శనహోమం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు వేదపారాయణ ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు.

**హేమాచలున్ని దర్శించుకున్న కలెక్టర్**

హేమాచల క్షేత్రంలో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య ఆలయంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మేళ తాళాలు, వేదమంత్రోచ్చరణలతో ఆయనను స్వాగతించి కలెక్టర్, కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక అర్చనలు జరిపించారు. సుదర్శన హోమం వద్ద కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులకు అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జి ల్లాకు సీనియర్ ప్రభుత్వ అధికారులు వచ్చిన సందర్భాల్లో మేడారం, రామప్ప, లక్నవరంతో పాటు మల్లూరు దేవస్థానాన్ని సందర్శించాలని తెలుపుతున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డు, దేవస్థానంలో రేలింగ్, మెట్లపై రేకుల ఏర్పాటుకు రూ.80 లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వం దూప దీప నైవేద్యం సమర్పించే అర్చకులకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు గౌరవ వేతనం పెంచిందన్నారు. దీనిలో భాగంగా దూపదీప నైవేద్యం కింద జిల్లాలో కొత్తగా మంజూరైన 13 మంది అర్చకులకు కలెక్టర్ ప్రొసిడింగ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ తుల రవి, మేడారం ఈఓ రాజేందర్, ట్రైబల్ వేల్ఫేర్ ఈఈ హేమలత, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ చేరాలు, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, ఆలయ రెనోవేషన్ చైర్మన్, కమిటీ సభ్యులు ముకుందం, తోలెం నర్సింహారావు, పీఆర్ ఏఈ పాడి వాసుదేవరెడ్డి, ట్రైబల్ వేల్ఫేర్ ఏఈఈ రాము, పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసర్లు, స్థానికులు పాల్గొన్నారు.

**ఎస్ఎస్ తాడ్వాయి:** రాష్ట్ర అవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మేడారం సమ్మక్క–సారలమ్మల గద్దెల ప్రాంగణంలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సమ్మక్క– సారలమ్మ గద్దెలను పూలు, మామిడి, బంతి పూల తోరణాలతో ఆలయం మొత్తం అలంకరించారు. గద్దెల ప్రాంగణంలో ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు, సమ్మక్క–సారలమ్మ పూజారులు మేడారం వచ్చిన భక్తులకు బెల్లం, కొబ్బరి ప్రసాదం పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక దినోత్సవంతో మేడారంలోని గద్దెల ప్రాంగణం ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సూపరింటెండెంట్ క్రాంతికుమార్, సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య, సమ్మక్క పూజారి అరుణ్‌కుమార్, సతీష్, పాల్గొన్నారు.

**వెంకటాపురం(ఎం):** మండలంలోని పాలంపేటలోని భైరవగుడి వద్ద సర్పంచ్ డోలి రజిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎంపీపీ బుర్ర రజిత సమ్మయ్య హాజరై ఆలయం వద్ద దీపాలను వెలిగించి పూజలు చేశారు. ఆధ్యాత్మిక దినోత్సవం గురించి విద్యార్థులకు, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ శ్రీనివాస్, డీటీ కిషోర్, డాక్టర్ భవ్య, పీఎస్ హెచ్‌ఎం కోకిల శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రామప్ప ఆలయంలో అర్చకులు హరీష్‌శర్మ, ఉమశంకర్‌లు తెలంగాణ ప్రజలు క్షేమంగా ఉండాలని వేదపారాయణం చేసి ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు.



పూజారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న కలెక్టర్



ఎస్ఎస్ తాడ్వాయి : ఆలయ ప్రాంగణంలో కొబ్బరి, బెల్లం ప్రసాదం పంపిణీ చేస్తున్న సిబ్బంది, పూజారులు



వెంకటాపురం(ఎం) : ఆధ్యాత్మిక దినోత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ఏటూరునాగారం:** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగా ధ్యానగురువు యర్రంకని రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వరప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగాలోని కొన్ని భంగిమలను గురువు శిక్షణ ఇచ్చారు. అలాగే మల్లూరుకు చెందిన మహాకార శాఖహారి సంస్థకు చెందిన పలువురు హైస్కూల్ గ్రౌండ్‌లో ధ్యానంతో సకల రోగాలను నివారించవచ్చని వివరించారు. క్రాస్‌రోడ్డులోని గిరిజన బాలికల కళాశాలలో యోగా ఈస్ చాలెంజ్ కార్యక్రమాన్ని ప్రీతీజి సభ్యులు రఘు, కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర చేపట్టారు. విద్యార్థులతో యోగా చేయించారు.

**మనో నిగ్రహంతో ఉండాలి**

ప్రతి వ్యక్తి మనస్సు తన సహజ శుద్ధావస్థను చేరటానికి నిరంతరం ప్రయత్నిస్తుందని, కానీ ఇంద్రియాలు మాత్రం మనస్సు బయటకు లాగుతూ ఉంటాయని సెకండ్ ఎస్సై లాల్, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మనస్సు ఇలా ఇంద్రియాల ద్వారా బయటకు వెళ్లకుండా నిరోధించటమే మనో నిగ్రహం, మనస్సు నిగ్రహించి, ఆత్మలో లయం చేయటానికి అంతర్ముఖం చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు చాముండేశ్వరి, డాక్టర్ వరప్రసాద్, సుచరిత, దేవులపల్లి సత్యనారాయణ, నల్లబోయిన కోటయ్య, ఏసీఎంఓ రవీందర్, యోగా గురు సురేష్, పొదెం కృష్ణప్రసాద్, భిక్షపతి, ప్రభాకర్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామ పంచాయతీ వద్ద బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కన్నాయిగూడెం వైద్యాధికారి అన్మిషా యోగా, ధా న్యం ఎలా చేయాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఐటీఐలో ధ్యానం చేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా ఒత్తిడిలేకుండా ఉండాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం : హైస్కూల్‌లో యోగా చేస్తున్న వైద్యులు, ప్రజలు

**చిరుతపల్లి ఆశ్రమ పాఠశాలలో..**

**వెంకటాపురం(కె) :** మండల పరిధిలోని బర్లగూడెం పంచాయతీ చిరుతపల్లి గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం బర్లగూడెం సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో ప్రపంచ యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి పుష్పవతి, హెచ్‌ఎం నాగరాజు తదితరులు ఉన్నారు.

**వాజేడు :** రోజు యోగా చెయ్యడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని ఎస్సై రేక అశోక్ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సివిల్, సిఆర్పీఎఫ్ పోలీసులుతో పాటు విద్యార్థులు సుమారు గంట పాటు యోగాస నాలు వేశారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయడం ఒక బాధ్యతగా గుర్తించాలని కోరారు.
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు బుధవారం యోగాసనాలు చేశారు. చెరుకూరు వద్ద చెరువులో మట్టి పనికి వెళ్లిన కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.



వెంకటాపురం(కె) : యోగాసనం చేస్తున్న విద్యార్థులు



వాజేడు : ఒంటి కాలుపై యోగాసనం చేస్తున్న ఎస్సై, విద్యార్థులు

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై

**మొగుళ్లపల్లి:** సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై శ్రీధర్ అన్నారు. బుధవారం కాసులపహాడ్‌లో ప్రజలు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్యను తగ్గుతుందన్నారు. నిందితులు నిఘా నుంచి తప్పించుకోలేరని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు.

## నేడు తాడ్వాయిలో కాంగ్రెస్ నిరసన

**ఎస్ఎస్ తాడ్వాయి :** దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దగా చేస్తున్న రాష్ట్ర సర్కార్‌పై నిరసనగా గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సీతక్క అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## రైతులు తొందరపడొద్దు

**మల్హర్:** తొలకరి వానకు విత్తనాలు విత్తుకోవడానికి రైతులు తొందర పడొద్దని వ్యవసాయాధికారి ముంజ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం వానాకాలంలో సాధారణ వర్షపాతం ఇంకా నమోదు కాలేదన్నారు. దీంతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వివిధ పంటలు విత్తుకోవడానికి సమయం దాటిపోలేదని వివరించారు. స్వల్పకాలిక రకాలు సాగుకి ఇంకా సమయం ఉందన్నారు. నేరుగా విత్తు పద్ధతులు (దమ్ము చేసి లేదా దమ్ము చేయకుండా) చేసేవారు వర్షపాతం నమోదు అయ్యే వరకు చూడాలని స్పష్టం చేశారు. పత్తి పంటలో కంది, పెసర, మినుములు, వేరుశనగ, ఆముదం ఇతర పంటలతో అంతర పంటగా సాగు చేయవచ్చన్నారు. సరైన యాజమన్య పద్ధతులు చేపట్టడం ద్వారా ఆగస్ట్ 15 వరకు కందిని సాగు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వెల్లడించారు.

## క్లుప్తంగా

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**ఏటూరునాగారం :** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక శివాలయంలో బుధవారం ఆలయ చైర్మన్ తాడూరి రఘు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు రాజ్‌కుమార్, గావిడి సారయ్య, రెడ్డి ప్రమీల పాల్గొన్నారు. అలాగే సాయిబాబా ఆలయంలో గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ రవీందర్, వెంకన్న ప్రత్యేక పూజలు చేశారు. శివాపురంలో బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలను సర్పంచ్ దేవేందర్ నిర్వహించారు.

### మసీదులో ప్రత్యేక ప్రార్థనలు



**వాజేడు:** మండల కేంద్రంలోని మసీదులో బుధవారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలో జెడ్పీటీసీ తల్లాడి పుష్పలత పాల్గొన్నారు.

### మేడారంలో బీజేపీ బైక్ ర్యాలీ



**ఎస్ఎస్ తాడ్వాయి :** మండలంలోని మేడారంలో బీజేపీ అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తీరుపై బైక్ ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి శ్రీకాంత్, నాయకులు లక్ష్మణ్, సిద్దబోయిన పాపారావు, జంగా హనుమంతారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



**ములుగు రూరల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ ములుగు పట్టణ కార్యదర్శి మమాన్‌యాదవ్ అన్నారు. బుధవారం డీఈఓ పాణినికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రైవేటులో అధిక ఫీజులు వసూలు చేయడంతో నిరుపేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



**మంగపేట :** జిల్లాస్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా కలెక్టర్ కృష్ణ ఆదిత్య చేతుల మీదుగా అవార్డు అందుకున్న మండలంలోని మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చందా బద్రయ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకున్న సందర్భంగా ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్ హాజరై ఉపాధ్యాయులతో కలిసి హెచ్‌ఎం భద్రయ్యను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొర్స సారయ్య, కోడి వెంకట్, ఈసం అనసూర్య, అబ్బు సత్యనారాయణ, జమీల్, అంజలి, సురేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా
- ఏఓ దామోదరస్వామికి వినతి



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ, బీసీ రైతులు, నాయకులు

**ఏటూరునాగారం:** మండలంలోని ఆకులవారిఘణపురం శివారులోని వ్యవసాయ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్న వారు, గిరిజనులు, గిరిజనేతరుల మధ్య వివాదాలు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, సీపీఐ మండల కార్యదర్శి నాసర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట భూ బాధిత రైతులు, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ ఏఓ దామోదరస్వామికి అందజేశారు. అనంతరం రఘు, నాసర్ మాట్లాడుతూ ఆకులవారి ఘణపురం 209 సర్వే నంబర్ గల భూమిని 50 సంవత్సరాలుగా స్థానికంగా ఉన్న ఎస్సీ, బీసీ కులాలకు చెందిన అనేక మంది రైతులు వ్యవసాయ చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈనెల 18న బడే సులోచన, బొల్లెం సారయ్య, బండ గణేష్, లింగాల చంద్రయ్య, సోయం మురళి, కుడుముల సంపత్ ఉద్దేశ్యపూర్వకంగా బూటారం, ముల్లకట్ట, రాంపూర్ గ్రామానికి చెందిన కొందరు గిరిజనులను పై వ్యక్తులు ముందు ఉండి నడిపించి మీకు పట్టాలు వస్తాయని తప్పుదోవ పట్టించి ఎస్సీ, బీసీల భూముల్లో బలవంతంగా గుడిసెలు వేస్తున్నారు. ఈ గుడిసెలను రైతులు అడ్డుకున్నారు. ఇలా గిరిజనులు, గిరిజనేతరుల మధ్య వివాధాలు సృష్టిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో రామటెంకి సమ్మయ్య, కొండాయి సమ్మయ్య, కొండాయి కృష్ణ, మా చర్ల వెంకటేశ్వర్లు, సూరయ్య, సత్యం, సావిత్రి, గాదె శంకరాచారి, సదానందం, కొమురయ్య, దుర్గం రాజు, కుమ్మరి రమణమ్మ, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిద్దాం



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జయశంకర్ చిత్రటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

**ఏటూరునాగారం :** దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిద్దామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ వద్ద జయశంకర్‌సార్ వర్ధంతి సందర్భంగా సార్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన లో వారు చూపించిన అహింస మార్గం రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, సయ్యద్ సర్దార్ పాషా, లొటపెటల రాజేష్, ఏటూరునాగారం సర్పంచ్ ఈసం రామూర్తి, కేకే రంజిత్, ఎంపీటీసీ సభ్యురాలు కుమ్మరి స్వప్న చంద్రబాబు, వావిలాల రాంబాబు, గండేపల్లి నర్సయ్య, కన్నాయిగూడెం మండల అధ్యక్షులు సుబ్బుల సమ్మయ్య, చింతగూడెం సర్పంచ్ దుర్గం నారాయణ, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్ ఐటీఐలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ట్రైనింగ్ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కుమారస్వామి, సాధిక్, మూవిన్ కుమార్, పాపారావు, విక్రమ్, సమ్మయ్య, రిజ్వాన, కొండయ్య పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థినులకు దుప్పట్లు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న కేసిరాం నాయక్

**ఎస్ఎస్ తాడ్వాయి :** విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఏటీడీఓ కేసిరాం నాయక్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినులకు దుప్పట్లు, పుస్తకాలు, యూనిఫాం దుస్తులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలోని పాఠశాలల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పద్మ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మి, ఉపాధ్యాయులు గోపాల్, బుచ్చయ్య, రాంచందర్, ఎం.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శిబిరం ఇన్‌చార్జ్ దాక్షయని

**చిట్యాల:** విద్యార్థులు పాఠశాలలో చక్కగా చదువుకుని ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని, మానసిక ఒత్తిడికి గురి కాకూడదని వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ శిబిరం ఇన్‌చార్జ్ దాక్షాయని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సాంఘీక సంక్షేమ పాఠశాలలో పాఠశాలలో సఖీ లీడర్ షిప్ స్పెషల్ క్యాంప్‌ను నిర్వహించారు. పది రోజుల పాటు జరిగే ఈ క్యాంపుకు ఉమ్మడి జిల్లాలోని ములుగు, కాటారం, చిట్యాల, శాయంపేట, ధర్మసాగర్, హసన్‌పర్తి, విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు షీం టీమ్, బాల్యవివాహాల నిర్మూలన, అత్మరక్షణ, మానసిక ఒత్తిడి, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి, ట్రైయినర్స్ దీప్తి, సిరిచందన, హారిక, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఎస్సై ఎండీ.షాఖాన్

**చిట్యాల:** మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు, క్రిమిసంహారక మందులు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎండీ.షాఖాన్ అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో రైతులు వేసే పంట విత్తనాలను ఫర్టిలైజర్ షాపుల్లో కొనుగోలు చేసే క్రమంలో రశీదుతో పాటు విత్తనాలను చూసి కొనుగోలు చేయాలని కోరారు. మండలంలో ఎక్కడైనా రైతులను మోసం చేసేందుకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది లింగన్న, అస్లాం జానీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com